AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatoday.in
25-2-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2

27, 28 తేదీల్లో జాతీయ సెమినార్ 2



పీడీఎస్ బియ్యం పట్టివేత 2



## విద్యుత్ సమస్యల పరిష్కారానికి వాట్సాప్ చాట్

**అక్షరటుడే, ఇందూరు:** విద్యుత్ వినియోగదారుల సమస్యలను పరిష్కరించేందుకు వాట్సాప్ చాట్ బాట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఎన్పీడీసీఎల్ ఎస్ఈ రాజేశ్వరరావు తెలిపారు. వినియోగదారులు 79016 28348 నెంబర్‌కు 'హాయ్' అని మెసేజ్ పెట్టిన వెంటనే రిప్లయ్‌గా అనేక ఆప్షన్లు వస్తాయన్నారు. అవసరమైన ఆప్షన్‌ను ఎంపిక చేయగానే ఫిర్యాదును అందజేయవచ్చని పేర్కొన్నారు. ఫిర్యాదును సంబంధిత అధికారికి చేరవేసి వెంటనే పరిష్కారమయ్యే అవకాశం ఉంటుందన్నారు. సమస్య పరిష్కారమయ్యాక సంక్షిప్త సమాచారంతోపాటు ఫోన్ కాల్ వస్తుందని తెలిపారు. కావున విద్యుత్ వినియోగదారులు అవకాశాలు సద్వినియం చేసుకోవాలని కోరారు.

## మెడికల్ కాలేజీలో ఏడుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్ల తొలగింపు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** నగరంలోని మెడికల్ కళాశాలలో అసిస్టెంట్ ప్రొఫెసర్లపై వైద్యవిధాన పరిషత్ కొరడా ఝులిపించింది. ఏడాదికి పైగా విధులకు గైర్హాజరవుతున్న ఏడుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లను తొలగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. నగరంలోని మెడికల్ కళాశాలను 2013లో స్థాపించారు. ఎంబీబీఎస్‌లో 120సీట్లు ఉన్నాయి. జనరల్ మెడిసిన్, సర్జరీ, పీడియాట్రిక్స్, అనస్థీషియాలో పీజీ సీట్లు ఉన్నాయి. నీట్ యూజీ, పీజీ కౌన్సెలింగ్ ద్వారా ప్రవేశాలు జరుగుతున్నాయి. దీనికి అనుబంధంగా జిల్లా జనరల్ ఆస్పత్రి ఉంది. జీజీహెచ్‌లో రోజుకు 1,500కు తగ్గకుండా ఓపీ పేషెంట్లు వస్తుంటారు. జిల్లా ప్రజలకే కాకుండా మహారాష్ట్ర నుంచి.. ఇతర జిల్లాల నుంచి సైతం రోగులు జీజీహెచ్‌కు వైద్యం నిమిత్తం వస్తుంటారు. నిజామాబాద్ మెడికల్ కళాశాలలో కొన్నేళ్లుగా కొందరు ప్రొఫెసర్లు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని డీఎంఈకి సమాచారం అందింది. ఈ క్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు అయేషా ఫరీన్, స్రవంతి, నిశిత, నీలకంఠం, సతీశ్‌రాజు, లక్ష్మణ్, అపూర్వ, లీలావతిలను తొలగిస్తూ వైద్య విద్య సంచాలకులు నరేంద్ర కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

## జీజీహెచ్‌లో జూడాల నిరసన




**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** శాశ్వత క్రీడామైదానం ఏర్పాటు చేయాలని జూనియర్ డాక్టర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు జీజీహెచ్‌లో జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు, ప్లకార్డులతో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. నగరంలో మెడికల్ కళాశాల ఏర్పాటై 13ఏళ్లు పూర్తయినప్పటికీ ఇప్పటివరకు శాశ్వత క్రీడామైదానం లేకపోవడం తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనంగా జూడాలు పేర్కొన్నారు. ప్రాథమిక వసతులలో భాగమైన కాలేజీ గ్రౌండ్ లేకపోవడం విద్యార్థుల విద్యా, క్రీడా, వ్యక్తిత్వాభివృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపుతోందన్నారు. మెడికల్ విద్య అనేది ఒత్తిడితో కూడిన కోర్సు అని జూడాలు పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో క్రీడామైదానం లేకపోవడంతో విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడుతోందన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి శాశ్వత కాలేజీ గ్రౌండ్ కేటాయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జూడాల అసోసియేషన్ అధ్యక్షుడు కార్తీక్ కొమ్మనబోయిన, జనరల్ సెక్రెటరీ జయంత్, వైస్ ప్రెసిడెంట్స్ సంతోష్, చంద్రకాంత్, వక్వార్, హేమంత్, రవి రాథోడ్ పాల్గొన్నారు.

## రేపు ఆర్మూర్ మున్సిపల్ పాలకవర్గ ప్రమాణ స్వీకారం

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ పురపాలక సంఘం నూతన పాలకవర్గం గురువారం కొలువు తీరనుంది. మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా గోనె లహరి, వైస్ ఛైర్మన్‌గా కాట్‌పల్లి వెంకటరెడ్డి, కౌన్సిలర్లు ప్రమాణస్వీకారం నిర్వహించనున్నారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో 36 వార్డులకు గాను మెజారిటీ స్థానాలు కాంగ్రెస్ పార్టీ గెలిచి ఆర్మూర్ మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకున్న విషయం తెలిసిందే.




# ఆస్తుల దుమారం

■ అరోరా కాలేజీ చుట్టూ వివాదం ■ కమిటీలో ఉన్నందుకే ఎమ్మెల్యేపై ఆరోపణలు ■ సైలెంట్ అయిన షబ్బీర్ అలీ

**కామారెడ్డిలో విద్యార్థుల కోసం సేకరించిన 263 ఎకరాల భూమి ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇందులో 26 ఎకరాలు అరోరా కళాశాలకు కేటాయించడం దుమారం రేపుతోంది. ఈ స్థలం కేటాయింపు గతంలోనే జరిగినా ప్రస్తుతం ఆ స్థలమే వ్యక్తిగత ఆరోపణలకు బీజం వేసిందన్న టాక్ వినిపిస్తోంది. విద్యార్థి సంఘాలు కొట్లాడి ఆస్తులను కళాశాల పరం చేసినా మళ్లీ వివాదం రాజుకోవడం చర్చనీయాంశంగా మారుతోంది.**

**– అక్షరటుడే, కామారెడ్డి**

కామారెడ్డి ప్రభుత్వ కళాశాలకు చెందిన 263 ఎకరాల భూమిలో కొంత వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ భవనాలు, పరిశ్రమలకు కేటాయించారు. ఇందులో నుంచే అరోరా కళాశాలకు 26 ఎకరాలు కేటాయించడం వెనక ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి హస్తం ఉందన్న ఆరోపణలు, ఆ భూములు తనఖా పెట్టి యాజమాన్యం రుణాలు తీసుకోవడం చర్చకు దారి తీస్తున్నాయి. ఈ విషయమై ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ మధ్య మాటల యుద్ధం కొనసాగగా ఆరోపణల అనంతరం షబ్బీర్ అలీ మౌనం దాల్చడం వెనక అంతర్యం ఏమిటన్న చర్చ సాగుతోంది.

### అరోరా కాలేజీపై..

ప్రస్తుతం జరుగుతున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆస్తుల వివాదం మొత్తం అరోరా కళాశాల చుట్టే తిరుగుతోంది. ఆ కళాశాలకు సంబందించిన యాజమాన్యాన్ని కమిటీలోకి ఆహ్వానించడం, కళాశాలకు 26 ఎకరాల కేటాయింపులు, భూములు తనఖా పెట్టి రుణం తీసుకునే అంశాలు తెరపైకి వచ్చాయి. ఈ మూడింటిలో ఎమ్మెల్యే రమణారెడ్డి పాత్ర ఉందంటూ ప్రధానంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. దాంతో ఇందులో తన పాత్ర ఏమి లేదని నిరూపించుకోవాల్సిన బాధ్యత ఎమ్మెల్యేపై పడింది.

### కమిటీలో ఉన్నందుకే..

కళాశాలకు సంబంధించిన కమిటీలో వెంకటరమణారెడ్డి తండ్రి కేపీ రాజిరెడ్డి కొనసాగారు. కమిటీలో ఉన్న కొందరు మృతి చెందడంతో వాళ్ల వారసులు వచ్చారు. అయితే ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డికి కమిటీలో స్థానం ఎలా లభించిందన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఆయన హయాంలోనే కళాశాల భూములు ఇతరులకు కేటాయింపులు జరిగాయన్న ఆరోపణలు వస్తున్నాయి.

### ఎమ్మెల్యే హాట్ కామెంట్స్

ఎమ్మెల్యే ప్రాణాలకు హానీ ఉందని ఇటీవల బీజేపీ నాయకులు వ్యాఖ్యానించారు. అయితే ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తనకు ప్రాణభయం లేదని, ప్రాణ భయం అంటే ఏమిటో వాళ్లకే చూపిస్తానని వ్యాఖ్యానించారు. పోతూ పోతూ పదిమందిని తీసుకువెళ్తానని మాట్లాడిన వీడియోలు సోషల్ మీడియాలో కాంగ్రెస్ నాయకులు వైరల్ చేస్తున్నారు.

### స్పందించని షబ్బీర్ అలీ

మున్సిపల్ ఎన్నికల తర్వాత ఈ నెల 16న ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డిపై ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అవినీతి ఆరోపణలు చేశారు. దానికి ఎమ్మెల్యే రమణారెడ్డి సైతం ధీటుగా బదులిచ్చారు. దాంతో వివాదం ముదిరింది. ఆస్తుల వివాదంపై అగ్గి రాజుకుంటుండగా ఎమ్మెల్యే నేరుగా షబ్బీర్ ఆలీపై విమర్శలు గుప్పిస్తున్నారు. అయితే ఎమ్మెల్యే ఆరోపణలపై షబ్బీర్ అలీ సైలెంట్‌గా ఉన్నారు. మంత్రిగా ఉన్నప్పుడు ఏం చేశారని, తెలంగాణ వర్సిటీ తేలేకపోయారని, ఒక్క మోడల్ పాఠశాల కూడా మంజూరు చేసుకోలేకపోయారని విమర్శించారు. అయితే ఏ ఒక్క ఆరోపణలపై కూడా షబ్బీర్ అలీ స్పందించడం లేదు. షబ్బీర్ అలీ మౌనం వెనుక ఆంతర్యం ఏమిటని పట్టణవాసులు చర్చించుకుంటున్నారు.

### విద్యార్థి సంఘాల ఎంట్రీ

తాజాగా కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధం కొనసాగుతుండగా కళాశాల ఆస్తులపై విద్యార్థి సంఘాలు ఎంట్రీ ఇచ్చాయి. నాడు కళాశాల కోసం సేకరించిన స్థలాన్ని ప్రైవేట్ సంస్థలు, పరిశ్రమలకు కేటాయించినప్పుడు నాయకులు ఎందుకు మాట్లాడలేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. నాయకులు అభివృద్ధిపై పోటీ పడాలని, విద్యాసంస్థలు తీసుకురావడంలో పోటీ పడాలని సూచించారు. కళాశాల ఆస్తులను పరిరక్షించేందుకు మరోసారి ఉద్యమం లేవనెత్తుతామని, జేఏసీ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. దాంతో ఈ వివాదం కొత్త మలుపు తిరిగింది.

## ఆహార భద్రతా నియమాలు పాటించకుంటే చర్యలు



**అక్షరటుడే, ఇందూరు:** ఆహార భద్రతా నియమాలు పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ నవిత హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్ ప్రాంతంలో పలు హోటళ్లను బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పలు ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో టేస్టింగ్ సాల్ట్, కృత్రిమ రంగుల వాడుతున్నట్లు గమనించామన్నారు. ప్రతి హోటల్లో పరిశుభ్రత పాటించాలని, నిబంధనల మేరకు ఆహార పదార్థాలు వినియోగించాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న యజమానులకు తగు సూచనలు చేశామన్నారు.

## ప్రజాపాలనలో పేదల కల సాకారం



**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** ప్రజాపాలనలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల కల సాకారమవుతోందని బాల్కొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్యాల సునీల్ రెడ్డి అన్నారు. ఈ మేరకు బుధవారం మండల కేంద్రంలో ఎనుగందుల లత ప్రసాద్ నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రతి పేదవాడికి లబ్ధి చేకూర్చే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలు అమలు చేస్తోందన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికీ 3,500 ఇళ్లను నిర్మిస్తున్నామని.. అర్హులకు మరిన్ని ఇళ్లు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సుంకేట రవి, ఏఎంసీ వైస్ ఛైర్మన్ బుచ్చన్న, టౌన్ ప్రెసిడెంట్ సల్లూరి గణేశ్, బుచ్చి మల్లయ్య, రాజేంద్ర ప్రసాద్, జగదీష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గోదావరి పుష్కరాలకు ఏర్పాట్లు చేయాలి



**అక్షరటుడే, బోధన్:** గోదావరి పుష్కరాలకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను సూచించారు. రెంజల్ మండలంలోని కందకుర్తి పుష్కర ఘాట్‌ను కలెక్టర్ బుధవారం సంబంధిత శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. 2027లో జరగనున్న గోదావరి పుష్కరాల నేపథ్యంతో జిల్లాలో ప్రధానమైన ఈ పుష్కర ఘాట్‌ను క్షేత్రస్థాయిలో సందర్శించారు. పుష్కర ఘాట్ వద్ద పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడాన్ని గమనించిన కలెక్టర్ సంబంధిత అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పుష్కరాల సమయంలోనే కాకుండా ఈ ప్రదేశానికి సాధారణ సమయాలలోనూ భక్తులు తరలివస్తారని, వారి సౌకర్యార్థం పరిసరాల పరిశుభ్రతతో పాటు కనీస సదుపాయాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. గోదావరి పుష్కరాలకు ఈ ఘాట్ వద్ద వీవీఐపీలు, లక్షలాదిగా భక్తులు పుణ్య స్నానాలకు తరలివచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ క్రమంలో ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా వాహనాల పార్కింగ్, మరుగుదొడ్లు, తాత్కాలిక గదులు, భక్తులు బస చేసేందుకు వీలుగా తగిన వసతి, షామియానాలు వంటివి పక్కాగా అందుబాటులో ఉండాలని కలెక్టర్ పేర్కొన్నారు. భక్తులకు పూర్తి స్థాయిలో పటిష్ట భద్రత ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులు వంటలు చేసుకునేందుకు వీలుగా కిచెన్ షెడ్ నిర్మించాలని సూచించారు. పుష్కర ఘాట్ వద్ద మెట్లు, ఘాట్ వంటి వాటికి అవసరమైన మేర మరమ్మతులు చేయించాలని అన్నారు. ఘాట్ వద్ద ప్రమాదాలకు ఆస్కారం లేకుండా అన్ని జాగ్రత్తలు చేపట్టాలని, హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని, రహదారికి మరమ్మతులు జరిపించాలని కలెక్టర్ ఆదేశించారు. కలెక్టర్ వెంట బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, దేవాదాయ శాఖ సహాయ కమిషనర్ విజయరామారావు, సంబంధిత శాఖల అధికారులు ఉన్నారు.

## దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

**అక్షరటుడే, ఇందూరు:** జిల్లాలోని రుద్రూర్, బాన్సువాడ, నిజామాబాద్‌లో హిందువులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి కోరారు. హైదరాబాద్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామ చందర్‌రావుతో కలిసి డీజీపీ శివధర్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు.దినేష్ కులాచారి మాట్లాడుతూ.. హిందువులపై కొందరు దుండగులు ఉద్దేశపూర్వకంగా దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. స్థానిక పోలీసులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదన్నారు. బాధితులు స్థానిక పోలీసు అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ కనీస స్పందన లేదని పక్షపాత ధోరణితో బాధ్యతారహిత్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఇకనైనా నిందితులను అరెస్టు చేసి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దాడులు జరుగుతున్న సున్నితమైన ప్రాంతాల్లో తక్షణమే పోలీసు బలగాలను మోహరించి భవిష్యత్తులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా హిందువులకు భద్రత కల్పించాలన్నారు.







## ఇంటర్ పరీక్షలు షురూ..

**ఇంటర్మీడియట్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తొలిరోజు ప్రశాంతంగా పరీక్షలు జరిగాయి. తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం పరీక్షలు, వోకేషనల్‌లో జనరల్ ఫౌండేషన్ కోర్స్ పరీక్ష నిర్వహించారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు చెందిన ఉన్నతాధికారులు, పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు హైపవర్ కమిటీ, సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు అన్ని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశాయి. విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా ఆయా కేంద్రాల్లో అధికారులు ఏర్పాట్లు చేశారు.**

**–అక్షరటుడే, ఇందూరు**

– మిగతా 2వ పేజీలో..

అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND.

2

నిజామాబాద్/కామారెడ్డి
బుధవారం
25.2.2026

www.aksharatoday.in

AKSHARA TODAY

## ట్రాఫిక్‌పై అవగాహన




**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని స్మైల్స్ ది స్కూల్ విద్యార్థులు బుధవారం ట్రాఫిక్ నియమాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. చిన్నారులంతా ట్రాఫిక్ నిబంధనలతో కూడిన చిహ్నాలను చేత పట్టుకొని రోడ్డుపై నిలబడి వాహనదారులకు అవగాహన కల్పించారు. 'ప్రాణాలు కాపాడుదాం' అనే నినాదంతో చిన్నారులు ట్రాఫిక్ నియమాలను ప్లకార్డుల ద్వారా వివరించారు. హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ పెట్టుకోవడం, ట్రాఫిక్ సిగ్నల్స్ ప్రాముఖ్యత, జీబ్రా క్రాసింగ్ ఉపయోగం, యూటర్న్, స్టాప్ సిగ్నల్స్ అర్థం వంటి అంశాలను విద్యార్థులు వివరించారు. ఈ కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ షబానా గౌహర్, డైరెక్టర్ రఫీ సింధుజ స్వప్న, సింధూర, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆశా కార్యకర్తలకు వేతనాలు చెల్లించాలి



**అక్షరటుడే, కోటగిరి:** ఆశ కార్యకర్తల వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆశాకార్యకర్తలతో కలిసి పీహెచ్‌సీ అధికారి కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ..ప్రభుత్వం కొంతమందికి వేతనాలు చెల్లించి, మరికొంతమందికి చెల్లించకపోవడం సరికాదన్నారు. అందరూ క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నందున తప్పనిసరిగా అందరికీ సమానంగా వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. వెంటనే వేతనాలు చెల్లించకపోతే సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశా కార్యకర్తలతో కలిసి పోరాటాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆశా కార్యకర్తలు పద్మ, అనిత, నాగమణి, శారద, శాంత పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశం



**అక్షరటుడే, భీమ్‌గల్:** వేల్పూర్ మండలంలోని పచ్చల నడ్కుడ గ్రామంలో గొర్తే శారదానర్సయ్య దంపతులు నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ (సీడ్ కార్పొరేషన్) ఛైర్మన్ అన్వేష్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, రిబ్బన్ కట్ చేసి గృహప్రవేశం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి పేదవానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు గడ్డం నర్సారెడ్డి, ఉప సర్పంచ్ రఘు, గ్రామశాఖ అధ్యక్షుడు గుడాల మోహన్, జిల్లా జనరల్ సెక్రెటరీ టక్కరి గంగాధర్, జిల్లా ఓబీసీ సెక్రెటరీ లింగేష్ పాల్గొన్నారు. అలాగే పార్టీ నాయకులు హలీమ్, నెహ్రూ, జల్లా భూమన్న, కృపాల్, భోజన్నలతో పాటు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ కార్యకర్తలు, లబ్ధిదారులు, గ్రామస్థులు పాల్గొని నూతన గృహ యజమానులకు శుభాకాంక్షలు తెలిపారు.

## గాంధారి మండల కేంద్రంలో..



**అక్షరటుడే, గాంధారి:** మండల కేంద్రంలోని పోచమ్మ కాలనీలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి బుధవారం కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా లబ్ధిదారులైన అంజవ్వ సాయిలుకు పట్టువస్త్రాలు అందజేశారు. తాము కలలో కూడా ఇల్లు కట్టుకుంటామని అనుకోలేదని కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ఇది సాధ్యమైందని లబ్ధిదారులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ గాంధారి మండలంలో 65 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయన్నారు. ఇందులో 40కి పైగా నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ తూర్పు రాజులు, ఏఎంసీ వైస్ ఛైర్మన్ లక్ష్మణ్, మహిళ మండల అధ్యక్షురాలు వసుంధర దేవి, కాంగ్రెస్ నాయకులు లైన్ రమేష్, బెజుగం సంతోష్, తాడ్వాయి సంతోష్, బాలు, అర్జున్ పాల్గొన్నారు.

# ఇంటర్ పరీక్షలు ప్రారంభం





**అక్షరటుడే, ఇందూరు:** ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. మొదటిరోజు తెలుగు, హిందీ, ఉర్దూ, సంస్కృతం పరీక్షలు, వొకేషనల్‌లో జనరల్ ఫౌండేషన్ కోర్స్ పరీక్ష నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 19,150 మంది విద్యార్థులకు గాను 18,574 మంది విద్యార్థులు హాజరయ్యారు. 576 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఇంటర్ విద్యాధికారి రవికుమార్ తెలిపారు. జిల్లా ఇంటర్ విద్యార్థి కన్వీనర్‌తో పాటు పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు హైపవర్ కమిటీ, సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్‌లు అన్ని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశాయి.

### కామారెడ్డి జిల్లాలో..

అక్షరటుడే, కామారెడ్డి: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకు పరీక్ష ప్రారంభం కాగా దాదాపు 8 గంటల వరకే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. ఇంటర్ పరీక్షల కోసం అధికారులు 37 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. జిల్లాలో మొత్తం 9,565 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా ఇందులో 9,228 మంది హాజరు అయ్యారు. 337 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.విద్యార్థులకు పరీక్షలకు కావాల్సిన వస్తువులు తప్ప ఇతర వాటిని లోపలికి అనుమతించలేదు. పరీక్షా కేంద్రాలను కామారెడ్డి సబ్ డివిజన్ ఏఎస్పీ చైతన్య రెడ్డి పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సెమినార్

**అక్షరటుడే, కామారెడ్డి:** కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సెమినార్ ముస్తాబవుతోంది. రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఈనెల 27, 28 తేదీలలో నిర్వహించనున్న జాతీయ సెమినార్ కోసం కళాశాల సర్వాంగ సుందరంగా సిద్ధమవుతోంది. 60 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగి, న్యాక్ 'ఏ' గ్రేడ్ సాధించిన ఈ కళాశాల ఇప్పుడు జాతీయ స్థాయి అతిథులకు స్వాగతం పలికేందుకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా.విజయ్ కుమార్ వివరాలు వెల్లడించారు. సెమినార్ ఏర్పాట్లలో భాగంగా కళాశాల ప్రవేశ ద్వారం వద్ద రోడ్డుకు ఇరువైపులా మట్టితో చదును చేసి సుందరీకరణ పనులు చేపట్టామన్నారు. . పరిసరాల పరిశుభ్రతతో పాటు పెయింటింగ్ పనులు పూర్తి చేసినట్లు వెల్లడించారు. సెమినార్ కోసం అత్యాధునిక డిజిటల్ సెమినార్ హాల్‌ను సిద్ధం చేశామని, ఈ సెమినార్‌కు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి జాతీయ, రాష్ట్ర స్థాయి విశ్వవిద్యాలయాల నుంచి ప్రముఖ ఆచార్యులు, విశ్లేషకులు రానున్నారని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి. బాలకృష్ణారెడ్డి, కళాశాల విద్యా కమిషనర్ దేవసేన, ప్రస్తుత రేరా ఛైర్మన్, పూర్వ కామారెడ్డి కలెక్టర్ డాక్టర్ సత్యనారాయణ తదితరులు హాజరుకానున్నట్టు వివరించారు. నూతన విద్యా విధానంలో




మార్పులు, దేశాభివృద్ధిలో ఉన్నత విద్య ప్రాధాన్యతపై ఆచార్యులు, పరిశోధక విద్యార్థులు తమ పరిశోధనా పత్రాలను ఈ సెమినార్ లో సమర్పించనున్నారని పేర్కొన్నారు. ఈ జాతీయ సెమినార్ నిర్వహణ ద్వారా కళాశాల ర్యాంకింగ్‌ను, నాణ్యతా ప్రమాణాలను మరింత మెరుగుపరుచుకునే అవకాశం ఉందన్నారు. ప్రతిష్టాత్మకమైన ఈ సెమినార్ తమ కళాశాలలో నిర్వహించడం వల్ల విద్యాపరంగా కళాశాల కీర్తి మరింత పెరుగుతుందని వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. కిష్టయ్య తెలిపారు.

## మున్సిపల్ ఛైర్‌పర్సన్ దంపతులకు సన్మానం



**అక్షరటుడే, భీమ్‌గల్:** నిర్మల్ మున్సిపల్ ఛైర్‌పర్సన్ అప్పాల కావ్య గణేష్ చక్రవర్తి, వైస్ ఛైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి దంపతులను పీఆర్‌టీయూ వేల్పూర్ మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. లక్కోరా గ్రామ పంచాయతీ ప్రథమ సర్పంచ్ దివంగత చాదల్ కిష్టయ్య పటేల్ మనవడైన గణేష్ చక్రవర్తి నేతృత్వంలో అప్పాల వంశానికి నాలుగోసారి మున్సిపల్ పీఠం దక్కడం విశేషం. ఈ సందర్భంగా రిటైర్డ్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చక్రపాణి, అరుణ చక్రపాణి దంపతులతో పాటు ఛైర్మన్ దంపతులకు పీఆర్‌టీయూ మండల ప్రధాన కార్యదర్శి సీవీ నరసింహారావు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు.

## విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ



**అక్షరటుడే, మెండోరా:** మెండోరా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 24 మంది విద్యార్థులకు గ్రామానికి చెందిన చాకలి కొత్తపల్లి సాయితేజ ఉచితంగా పరీక్ష ప్యాడులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సాయితేజ మాట్లాడుతూ.. విద్యార్థులు భయపడకుండా పరీక్షలు రాసి మంచి మార్కులు సాధించాలని సూచించారు. ఒత్తిడికి గురి కావొద్దని, కష్టపడి చదువుకోవాలన్నారు. పదో తరగతి భవిష్యత్తుకు మొదటి మెట్టు అని, దీన్ని సవాలుగా స్వీకరించాలని సూచించారు. పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేసిన సాయితేజను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## ప్రైవేట్ ఆస్పత్రిలో యువకుడి అనుమానాస్పద మృతి



**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. ఆస్పత్రిలో మత్తు వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే ఈ ఘటన జరిగిందని మృతుడి బంధువులు ఆరోపిస్తున్నారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని ఖలీల్‌వాడిలోఉన్న ద్వారకా ప్రైవేట్ ఆస్పత్రిలో భీమ్‌గల్ మండలం పల్లికొండ గ్రామానికి చెందిన గంగం అజయ్ చెవినొప్పితో మంగళవారం సాయంత్రం జాయిన్ అయ్యాడు. అయితే బాధితుడు అజయ్‌ను పరిశీలించిన చెవి వైద్య నిపుణుడు ఆపరేషన్ చేయాలని చెప్పాడు. ఆపరేషన్ కోసం అన్ని సిద్ధం చేసుకుని మత్తు వైద్యుడిని పిలిపించారు. మత్తు ఇంజిక్షన్ ఇచ్చిన అనంతరం రెండు మూడు గంటలైనా ఎలాంటి సమాచారం ఇవ్వలేదని.. అడిగితే నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని బాధితులు పేర్కొన్నారు. చివరికి పేషెంట్ పరిస్థితి సీరియస్‌గా ఉందని వైద్యులు సమాధానం చెప్పారని బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు. వెంటనే తాము మరో ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్తే అప్పటికే మృతి చెందాడని చెప్పినట్లు విలపించారు. దీంతో అజయ్ మృతదేహాన్ని మొదట చికిత్స అందించిన ఆస్పత్రి ఎదుట ఉంచి ఆందోళన చేశారు. మత్తు ఇంజిక్షన్‌తోనే అజయ్ మృతి చెందాడని.. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## పీడీఎస్ బియ్యం పట్టివేత



**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** నగరంలో పీడీఎస్ బియ్యం డంప్‌పై సీసీఎస్ పోలీసులు మెరుపుదాడి చేశారు. ఈ క్రమంలో సుమారు 40 క్వింటాళ్ల బియ్యంను స్వాధీనం చేసుకున్నారు. సీసీసీ ఏసీపీ ఇన్‌ఛార్జి ఏసీపీ మస్తాన్ అలీ తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని ఒకటో టౌన్ పరిధిలోని మిర్చికంపౌండ్, కెనాల్ కట్ట, ఎరుకల వాడలో పీడీఎస్ బియ్యం డంప్ ఉందనే సమాచారంతో ఇన్‌స్పెక్టర్ సాయినాథ్, ఎస్సై గోవింద్ దాడులు చేశారు. హేక్ సాహెబ్ హుస్సేన్ ఇంట్లో దాచి ఉంచిన 40 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంను స్వాధీనం చేసుకున్నారు. బొలేరో వాహనాన్ని, బియ్యంను సీజ్ చేసినట్లు సీసీఎస్ ఇన్‌ఛార్జి ఏసీపీ వివరించారు.

## పరీక్ష కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు



**అక్షరటుడే గాంధారి:** మండల కేంద్రంలోని ఇంటర్మీడియట్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా ఎస్సై ఆంజనేయులు సిబ్బందితో కలిసి పరీక్ష కేంద్రం వద్ద బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి పరీక్షలు రాయాలని సూచించారు. మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడవద్దన్నారు. పరీక్ష కేంద్రం సమీపంలో జిరాక్స్ సెంటర్లు మూసి ఉంచాలన్నారు.

## భవిత సెంటర్‌లో వైద్యశిబిరం




**అక్షరటుడే, బాల్కొండ:** మండలంలోని భవిత సెంటర్‌లో ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్‌బీఎస్‌కే ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఇందులో భాగంగా చిన్నారులకు జనరల్ హెల్త్ చెకప్‌తో పాటు ఫిజియోథెరపీ చికిత్స అందించారు. ఈ సందర్భంగా ఎంఈవో బట్టు రాజేశ్వర్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల పిల్లలకు ఫిజియోథెరపీ ఒక వరమన్నారు. ప్రతి సోమవారం, గురువారం రెండు రోజుల పాటు ఉచిత ఫిజియోథెరపీ సేవలు అందిస్తున్నామని, మండలంలోని తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే కిసాన్ నగర్ ఉర్దూ మీడియం పాఠశాలలోనూ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే వైద్యుడు సూర్యనారాయణ, ఫిజియోథెరపిస్ట్ అఖిల, ఐఆర్‌పీ రాజ నర్సయ్య, ఏఎన్‌ఎం స్వరూపరాణి, ఆర్‌బీఎస్‌కే ఫార్మసిస్ట్ నిశాంత్ పాల్గొన్నారు.

## భయం లేకుండా పరీక్షలు రాయాలి




**అక్షరటుడే, లింగంపేట:** విద్యార్థులు భయం లేకుండా పరీక్షలు రాయాలని మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ ఎలమంచి రామకృష్ణ పేర్కొన్నారు. మండలంలోని కాంప్లెక్స్ పరిధిలో శెట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పరమళ్ల, శెట్‌పల్లి సంగారెడ్డి పాఠశాలల్లో పదో తరగతి విద్యార్థులకు ఆయన పరీక్షలపై భయం పోయేలా అవగాహన కల్పించారు. విద్యార్థులు మానసికంగా పరీక్షలకు ఎలా సిద్ధం కావాలో వివరించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు వసుధ, శేషయ్య, సందీప్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు ఎలమంచి రామకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

## డ్రంకన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

**అక్షరటుడే, బాల్కొండ:** డ్రంకన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలుశిక్ష విధిస్తూ ఆర్మూర్ న్యాయస్థానం తీర్పునిచ్చింది. ఈ మేరకు బాల్కొండ ఎస్సై శైలేందర్ వివరాలు వెల్లడించారు. బాల్కొండ పీఎస్ పరిధిలో డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించగా వేంపల్లి గ్రామానికి చెందిన రాజేశ్వర్ మద్యం తాగి వాహనం నడుపుతున్నట్లు గుర్తించారు. ఈ మేరకు అతడిని అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చారు. విచారించిన ఆర్మూర్ మేజిస్ట్రేట్ భవ్యశ్రీ అతనికి ఐదు రోజుల సాధారణ జైలు శిక్ష విధించారు. మద్యం సేవించి వాహనం నడపడం చట్టరీత్యా నేరమని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఈ సందర్భంగా పోలీసులు సూచించారు.